క్లుప్తంగా

వాకలపూడి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పలు నిర్మాణాలకు శంకుస్థాపన



వాకలపూడిలో చెరువు అభివృద్ధి పనులపై మండల ఇంజినీర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం శంకస్థాపన చేశారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న చెరువు అభివృద్ధి, పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.37లక్షలు, హైస్కూల్ నుంచి ఏడీబీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలతో శంకుస్థాపన చేశారు. అనంతరం బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంపెక్స్‌ను పరిశీలించి త్వరలో ప్రారంభించేలా పనులు వేగంగా పూర్తి చేయాలని ఏఈ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాకలపూడి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, నాయకులు గొల్లపల్లి జగన్, విజయసారధి, కరీం బాషా, జీఎస్ఎన్, రాజ్‌కుమార్, కొల్లుబోయిన భవానీ పాల్గొన్నారు.

దేవాలయ భూములు గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దేవదాయశాఖాధికారి నారాయణమూర్తి

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): దేవాలయాల భూములు పక్కాగా గుర్తించి వాటిని నిషేధిత భూమల జాబితాలో చేర్చాలని జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి అన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో జిల్లాలోని దేవాలయాలు, సత్రాలు ఈఓలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర భూసర్వేలో దేవదాయశాఖ భూములు వెలుగులోకి వస్తున్నాయన్నారు. సర్వేలో తప్పనిసరిగా ఆయా సత్రాలు, ఆలయాలకు చెందిన ఈఓలు పాల్గొనాలన్నారు. గ్రామాల్లో ఎంతెంత భూమి ఉంది, రికార్డుల్లో ఎంత భూమి ఉంది, ఆక్రమణలో ఎంత భూమి ఉందో చూసుకోవాలన్నారు. దేవదాయశాఖ వద్ద రికార్డుల ప్రకారం కాకుండా అక్కడ భూములు తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా సంబంధింత మండల తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, సత్రాలు, ఆలయాల ఈఓలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో శిక్షణ కూడా ఇవ్వాలి

ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి ఉమాదేవి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌మేళాతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి ఆర్.ఉమాదేవి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో మోడల్ కెరియర్ సెంటర్ (ఎంసీసీ)ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కాకినాడ, కోనసీమ జిల్లాల ఉపాధి అధికారులు శ్రీనివాసరావు, వసంతలక్ష్మితో సమావేశమై జాబ్‌మేళాల నిర్వహణ, గైడెన్స్‌తో పాటు అవసరమైన శిక్షణ ఇచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలను సందర్శించి యువతకు ఉపాధి ఇచ్చేలా కృషిచేయాలని సూచించారు. ప్రతి నెలా సగటున రెండు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, అలాగే కౌన్సెలింగ్‌కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాసరావు వివరించారు. మోడల్ కెరియర్ సెంటర్ ప్రతినిధి పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవం వివాదాస్పదం

కాకినాడ క్రైం: సీబీసీఎన్‌సీ ఆస్తుల వివాదం మరోమారు రచ్చకెక్కింది. జిల్లా పరిషత్ కూడలి సమీపంలో ఉన్న సీబీఎం చర్చి కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న సివిల్ వివాదం కోర్టుకెక్కింది. అయితే ముత్తాబత్తుల రత్నకుమార్ ఆధ్వర్యంలో ఈ స్థల ఆవరణలో కొత్తగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం మరోమారు వివాదమైంది. రత్నకుమార్ గురువారం ఈ చర్చిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయగా మరో వర్గానికి చెందిన అగస్టీన్ బృందం అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి అదుపుతప్పేలా ఉందన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. కోర్టు వేదికగా తేల్చుకోవాలని చెప్పి పంపేశారు.

రెవెన్యూ అధికారికి కమిషనర్‌గా పదోన్నతి

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పని చేసిన పూడి రవిబాబుకు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దాంతో గురువారం ఆయన శ్రీకాకుళంలో బాధ్యతలు స్వీకరించారు. రవిబాబును కమిషనర్ జె.రామారావు, మేనేజరు అచ్యుతరాజు, ఇతర సిబ్బంది అభినందించారు.

మాతా శిశువులకు సురక్ష

- న్యూట్రిషన్ కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలకు అవగాహన
- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కాకినాడ రూరల్: డబ్బుతో కొనలేనిది ఆరోగ్యం. ఆరోగ్యంపై అవగాహన ఉంటే అసలు ఔషధంతో పని ఉండదు. పోషకాహారం, సమతులాహారం తీసుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. ఇది మాతృగర్భం నుంచే సమకూరితే శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో జన్మిస్తాడన్నది పెద్దల మాట. నేటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా సాధారణ కాన్పుల స్థానే సిజేరియన్లే ఎక్కువ అవుతున్నాయి. మానసిక ఒత్తిడి, పౌష్టికాహార లోపం తదితర సమస్యలతో నేటి గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తూ తల్లి, బిడ్డల క్షేమం కోసం కృషి చేస్తోంది. ఇదే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 45 రోజుల వ్యవధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. నిపుణులైన వైద్యులు సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు న్యూట్రిషన్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. కాకినాడ రూరల్, కరప మండలాలలో 58 సచివాలయాలు, అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గం 8 డివిజన్లలో పోషకాహారంపై కౌంటర్లు ఏర్పాట్లు చేశారు.



ఇంద్రపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద పోషకాహారం గురించి గర్భిణులు, బాలింతలకు వివరిస్తున్న ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు అధికారులు



స్టాల్స్‌లో ప్రదర్శనగా ఉంచిన పోషకాహార పదార్థాలు

స్టాల్స్‌లో ఆకట్టుకుంటున్న స్లోగన్స్

- గ్లాసుడు పాలు తాగండి.. గుప్పెడు కాల్షియం పొందండి.
- పసుపు పచ్చ పళ్లు తినండి వ్యాధి నిరోధకాన్ని పెంచుకోండి.
- చిరుధాన్యాలు తినండి చిరకాలం జీవించండి.
- దంపుడు బియ్యం తినండి విటమిన్ బి12 పొందండి.
- ఆకుకూరలు తినండి రక్తహీనత నివారించండి.

అనూహ్య స్పందన



న్యూట్రిషన్ కౌన్సెలింగ్ సెంటర్లకు అనూహ్య స్పందన లభిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద ఇప్పటి వరకు కాకినాడ రూరల్ మండలంలో పి.వెంకటాపురం, రమణయ్యపేట, కొవ్వూరు, ఇంద్రపాలెంలో స్టాల్స్ ద్వారా పోషకాహారం గురించి అవగాహన కల్పించాం.

– యానరపు లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, కాకినాడ రూరల్

పోషకాహారంపై అవగాహన కల్పించాం



కాకినాడ అర్బన్ గైగోలుపాడులో 14 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 49వ డివిజన్‌లో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించాం. రాగి జావ ఉచితంగా పంపిణీ చేశాం.

– అరుణ దుర్గాంబ, సూపర్‌వైజర్, ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు

ప్రజల వద్దకే వైద్య సేవలు



వాకాడలోని వైద్యశిబిరంలో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా, ఇంటి ముంగిటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం వాకాడలో గురువారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామసచివాలయం పరిధిలో వాకాడ, పెదకొత్తూరు గ్రామాల నుంచి 440 మంది శిబిరానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యులు ఎంకే సౌజన్య, ఇ.సింధూర, కరప పీహెచ్‌సీ డాక్టర్ పి.ఆశతో పాటు కాకినాడ నుంచి వచ్చిన వైద్యులు రోగులను పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటుచేశారు. రోగులకు కేస్‌షీట్, మందులుతో కూడిన జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగ్‌లను స్థానిక నాయకులు, అధికారులతో కల్సి ఎంపీపీ అందజేశారు. కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, అడబాల ప్రసాద్, చింతా బుజ్జి, అడబాల బుచ్చిబాబు, చోడిశెట్టి చంటి, ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు, ఆరోగ్యమిత్ర వి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి
- మదరసా నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ: ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సినిమారోడ్‌లోని అక్సా మసీదు వద్ద రూ.24 లక్షలతో ప్రతిపాదించిన మదరసా భవన నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అదే ప్రాంగణంలో మరో రూ.20 లక్షలతో రెండో అంతస్తు కూడా నిర్మించాల్సి ఉందన్నారు ఆయన అన్నారు.

ముస్లిం మైనార్టీల సౌకర్యార్థం ఇప్పటికే నగరంలో రెండు కొత్త మసీదుల నిర్మాణం, మదరసా, షాదీ ఖానాలను అభివృద్ధి చేస్తామన్నారు. పరలోపేటలో రూ.30 లక్షలతో మదరసా నిర్మిస్తున్నట్టు తెలిపారు. ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటామని, ఏ సమస్య అయినా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, జిల్లా వక్ఫ్ అధ్యక్షుడు రెహమాన్ ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాష, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్ బిన్ వలి, మసీదు ప్రతినిధులు పాల్గొన్నారు.



మదరసా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

రూ.2 కోట్లతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం

బోట్‌క్లబ్: కాకినాడ సినిమా రోడ్డులోని సంతచెరువు వద్ద ఉన్న పురాతన అమ్మవారి ఆలయాన్ని రూ.రెండు కోట్లతో పునర్నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ప్రధాన దాత, త్రిపుర సుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. భక్తులు, దాతల తోడ్పాటుతో ఆరు నెలల్లో నిర్మాణం తుది దశకు చేరుకోవడం హర్షణీయమన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి విగ్రహ ప్రతిష్ఠకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

వీధి వ్యాపారాల క్రమబద్ధీకరణకు ప్రణాళిక

- 42 వెండింగ్ జోన్ల గుర్తింపు
- నిర్దేశిత ప్రాంతాల్లోనే అనుమతి
- కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: నగర సుందరీకరణ, ట్రాఫిక్ సమస్యలు, ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీధి వ్యాపారాలను క్రమబద్ధీకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఇందుకోసం నగరాన్ని 42 వెండింగ్ జోన్లుగా విభజించినట్లు ఆయన తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులతో ఆయన సమీక్షిస్తూ అభివృద్ధి చెందుతున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం కాకినాడను 11 రెడ్ జోన్లుగాను, 25 గ్రీన్ జోన్లగాను, 6 యాంబర్ జోన్లుగాను విభజించామన్నారు. గ్రీన్ జోన్లలో నిరంతరాయంగా వ్యాపారాలు చేసుకోవచ్చని, రెడ్ జోన్లలో మాత్రం వ్యాపారాలకు అనుమతి లేదని అన్నారు. యాంబర్ జోన్లలో నిర్ణీత సమయాల్లో వ్యాపారాలకు అనుమతిస్తామని తెలిపారు. నగరంలోని వీధి వ్యాపారుల సంఖ్య మేరకు ఆయా జోన్లలో వ్యాపారాలకు అనుమతిచ్చే విషయమై ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకట రాజు, సీవోలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

టిడ్కో పనుల ప్రగతిపై సమీక్ష..

టిడ్కో ఇళ్ల ప్రగతిపై కమిషనర్ నాగ నరసింహారావు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. మొదటి విడత ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న మార్ట్‌గేజ్, రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా 541 టిడ్కో ఇళ్లకు మార్ట్‌గేజ్ పూర్తి కావాల్సి ఉందని, వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని కోరారు. రెండో విడత 904 మంది లబ్ధిదారులకు సంబంధించి ప్రగతిని సమీక్షించారు. ఈనెల 20వ తేదీ లోపు అన్ని పనులు పూర్తిచేసి ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. అక్కడి మౌలిక వసతుల కల్పన ప్రగతిని సమీక్షించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, టిడ్కో ఏఈ సుధీర్, సీఎంఎం వెంకట్రాజు, సీఓలు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కాకినాడ రూరల్: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సైకాలజిస్ట్, ఎస్‌వైఎస్ కంపెనీ వ్యవస్థాపకురాలు డాక్టరు దామెర విజయలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో గురువారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి అధ్యక్షత వహించారు. పీజీ సెంటర్‌లోని విద్యార్థులు ఒత్తిడిని జయించడం, పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టరు శ్రీరామరాజు, డాక్టరు అనిల్ అంబిక, డాక్టర్ మధుకుమార్, మనోజ్ దేవ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శరత్



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూలపేట ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పీతల శరత్‌చంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైఎస్సార్ టీఎఫ్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. తనను నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేసి తన విధులు సక్రమంగా నిర్వహిస్తానని శరత్‌చంద్ర తెలిపారు.

పీఏసీఎస్ అకౌంట్‌పై నిషేధం ఎత్తివేత

కరప: స్థానిక పీఏసీఎస్ (పీఏసీఎస్) అకౌంట్ నిర్వహణపై ఉన్న బ్యాన్‌ను ఎత్తివేస్తూ ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఆ సంఘం పర్సన్ ఇన్‌చార్జి, కాకినాడ సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. పీఏసీఎస్ తరఫున ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేస్తున్న ఏజెన్సీ చేసిన పొరపాట్ల వల్ల, ఆదాయ పన్ను అధికారులు ఇచ్చిన నోటీసులకు స్పందించక పోవడం వల్ల ఈ అకౌంట్ నిర్వహణను నిలిపివేస్తూ ఆగష్టు 21న ఉత్తర్వులు జారీచేశారు. కాగా బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి, సంబంధిత ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయంలో స్టే పిటిషన్ వేయడంతో అకౌంట్‌పై ఉన్న బ్యాన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు వచ్చినట్టు గణేష్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి సొసైటీ కార్యకలాపాలు యథాతథంగా నిర్వహిస్తామని పర్సన్ ఇన్‌చార్జి గణేష్‌కుమార్ వివరించారు.

అన్ని విధాలుగా గైగోలుపాడు అభివృద్ధి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: గైగోలుపాడును అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా 49వ డివిజన్ సచివాలయం- 1ఎ పరిధిలో రామ్‌నగర్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గడప గడపకూ వెళ్లినప్పుడు వచ్చిన విన్నపాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు. నవరత్న సంక్షేమ పథకాలలో భాగంగా పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఏదైనా కారణం చేత పథకాలు నిలిచిపోతే వాటిని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల చినబాబు, సీనియర్ నాయకుడు పాలిక రమణ, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, సేవాదళ్ మండల అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్ ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఫిష్ స్టాల్స్‌తో యువతకు ఉపాధి

- మత్స్య శాఖ ద్వారా సబ్సిడీ
- ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా కల్పించే సబ్సిడీని సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక డైరీఫారం సెంటర్, పాములాలతూము జంక్షన్‌లలో ఏర్పాటు చేసిన ఫిష్ స్టాల్స్‌ను (మినీ రిటైల్ అవుట్‌లెట్) ఆయన గురువారం ప్రారంభించారు. రూ.1.75 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌కు లబ్ధిదారుని వాటాగా 10 శాతం సమకూర్చుకుంటే, 75 శాతం మత్స్యశాఖ ఇస్తుందని, 15 శాతం బ్యాంకు రుణం పొందవచ్చని చెప్పారు. ఇటువంటి పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, జిల్లా మత్స్య శాఖ అధికారి సత్యనారాయణ, ఎఫ్‌డీఓ నూకరాజు, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరిపల్లి సీతారామ్ పాల్గొన్నారు.



ఫిష్‌స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఏపీజీఆర్ఈ రాష్ట్ర కార్యవర్గంలోని జిల్లా నాయకులను సత్కరిస్తున్న సభ్యులు

నాగమల్లితోట జంక్షన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా ఏపీజీఆర్ఈ సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం పేర్కొన్నారు. గురువారం స్థానిక అర్బన్ ఎంఆర్ఓ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ భవన్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర సంఘ ఎన్నికల్లో పదవులు పొందిన జిల్లా నాయకులను ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు పద్మనాభం అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు శాస్త్రి, కోశాధికారి ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు పద్మనాభం, కార్యదర్శి సాజిదాలను సత్కరించారు. అనంతరం సభ్యులకు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటకం ఇంద్రప్రస్థం

- ముగిసిన నాటక పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళామందిరంలో పంతం పద్మనాభం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న నాటకం పోటీలు గురువారంతో ముగిసాయి. ఉత్తమ ప్రదర్శనగా గుంటూరుకు చెందిన ఇంద్రప్రస్థం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన మిత్రా క్రియేషన్స్ బృందం ప్రదర్శించిన ది ఇంపోస్టర్స్, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్‌కే చెందిన కళాంజలి బృందం ప్రదర్శించిన నిర్మల నాటకాలు బహుమతులు గెలుచుకున్నాయి. ఉత్తమ రచనగా ఇంద్రప్రస్థం నాటకంలో స్నిగ్ధ, ఉత్తమ దర్శకత్వం ఇంద్రప్రస్థం నాటకం ఎం.రవీంద్రరెడ్డి, ఉత్తమ నటిగా ఎస్.అనూష, ఉత్తమ నటుడిగా ఎస్.రవీంద్రరెడ్డి ఎంపికయ్యారు. జ్యూరీ అవార్డు క్షీరసాగర మథనం నాటకంలోని సీవీఆర్ మూర్తి, సిరిమింగిన వెలగపండు నాటికలోని ఏవీ రమణమూర్తి గెలుచుకున్నారు. ఈ నాటక పోటీలకు కేజీ వేణు, కట్టా కృష్ణారావు, మార్ని జానకీరామచౌదరి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఆకొండి భాస్కరరావు బహుమతులు అందించారు. పంతం పద్మనాభం స్మారక నాటక కళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం మాట్లాడుతూ పంతం పద్మనాభం నాటక కళలు పట్ల ఆసక్తితో నాటక రంగానికి ఎంతో సేవ చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు 22 ఏళ్లుగా నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ఉత్తమ దర్శకత్వానికి అవార్డు అందుకుంటున్న రవీంద్రరెడ్డి

మూడు కేసులలో ముద్దాయికి జైలుశిక్ష

కరప: ఒకే గ్రామంలో ఒక వ్యక్తి మూడు వేర్వేరు రోజులలో నగదు, బంగారు, వెండి నగలు అపహరించుకుపోయిన కేసులో నేరం రుజువుకావడంతో ఒక్కొక్క కేసుకు ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ వెయ్యి జరిమానా విధిస్తూ ఏక కాలంలో అమలు చేయాలని కాకినాడ స్పెషల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. మండలం వేళంగి గ్రామానికి చెందిన మెర్ల రామకృష్ణ, బోళ్ల మంగాయమ్మ, పాతూరి వీర్రాజులు గృహాల్లో కాజులూరు మండలం అండ్రంగికి చెందిన సమనాసి గొల్లయ్య చొరబడి నగదు, ఆభరణాలు అపహరించుకుపోయాడు. అప్పటి ఎస్సై జి.అప్పలరాజు, హెచ్‌సీ చోరీ సొత్తు రికవరీ చేసి, ముద్దాయిని సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరచారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ జగదీష్ కేసు వాదించారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పుచెప్పారు. ఎస్ఐ ఎస్.రామకృష్ణ, అప్పటి దర్యాప్తు అధికారి జి.అప్పలరాజు, ఏపీపీ జగదీష్‌లను ఎస్పీ సతీష్ అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: డ్వామా ఏపీఎం, ఏపీఓలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. అధికారులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ వారికి సూచించారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కలు ఎక్కువగా నాటే అవకాశం ఉంటుందని, ఉపాధి హామీ పథకంలో వీటి ప్రాధాన్యత ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలకు పోషకాలు అందించే మొక్కలను ప్రతి గ్రామంలో నాటాలని ఆయన సూచించారు. ఈ మేరకు మునగ విత్తనాలను వేసుకొవడంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. మునగ ఆకులోను, మునగకాడలోనే అనేక పోషకాలు ఉంటాయని చెప్పారు. మునగ విత్తనాల లభ్యత, కాండంతో నాట్లు వేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్ నిహారిక శిక్షణలో నేర్చుకున్న అంశాలపై వివరాలు సేకరించారు. వారికి రాత పరీక్ష నిర్వహించిన అనంతరం ఫ్యాకల్టీలు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి మండలంలోను జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుండడం వల్ల శిక్షణలకు విరామం ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయ హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక సంతచెరువు వద్ద ఉన్న కనకదుర్గ ఆలయ హుండీలను గురువారం దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆరు నెలల 15 రోజుల వ్యవధికి రూ.2.39 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

8న మాల మహానాడు జిల్లా సమావేశం

బోట్‌క్లబ్: జిల్లా పీవీరావు మాలమహానాడు కార్యవర్గ సమావేశం ఈ నెల 8న కాకినాడ శాంతినివాస్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు జక్కల ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

విద్యార్థినులకు నాప్‌కిన్స్ అందజేత

బాలాజీచెరువు: సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామాజిక బాధ్యతలో భాగంగా గురువారం యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారులు శానిటరీ న్యాప్‌కిన్స్, డిస్పోజబుల్ డస్ట్‌బిన్స్ అందజేశారు. బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్, డిప్యూటీ ఆర్ఎం డీవీ రంగారావు హాజరై అందజేశారు. తమ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యారంగానికి సంబంధించి సేవా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తున్నామన్నారు. స్కూల్ యాజమాన్యం బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది.